

నేడు ఉప రాష్ట్రపతి రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ మిలాన్-24లో పాల్గొనడానికి గురువారం సతీసమేతంగా విశాఖపట్నం వస్తున్నారు. వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో ఉదయం ఎనిమిది గంటలకు ఢిల్లీలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో దిగుతారు. సముద్రిక ఆడిటోరియంలో జరిగే ఇంటర్నేషనల్ మేరీటైమ్ సదస్సులో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు అక్కడి ఉండి తిరిగి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిపోతారు.

కళావిహీనంగా వ్యూపాయింట్

నిర్వహణ లోపం, మందుబాబుల ఆగడాలతో అధ్వానంగా మారిన వైనం

ప్రకృతి అందాలను ఆస్వాదించలేకపోతున్నామని పర్యాటకుల ఆవేదన

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

పాడేరు ఘాట్‌లో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ప్రధాన వేదికైన వ్యూపాయింట్ ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. దాని నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడం, మందుబాబులకు అడ్డాగా మారడంతో పర్యాటకులు ఈ వ్యూపాయింట్‌ను వినియోగించుకోలేకపోతున్నారు. ఒకప్పుడు ఎంతో అందంగా ఉండే వ్యూపాయింట్ ఇప్పుడు కళావిహీనంగా మారడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు ఘాట్‌లో నిరుపయోగంగా ఉన్న వ్యూపాయింట్



వ్యూపాయింట్ నుంచి కనిపించే ప్రకృతి అందాలు

పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్లే ఘాట్‌లో అమ్మవారి పాదాలు ప్రాంతం దాటిన తరువాత ఉన్న మలుపు నుంచి చూస్తే ఘాట్‌లోని ప్రకృతి దృశ్యాలతో పాటు, ఘాట్ మలుపులు చూడముచ్చటగా కనిపిస్తాయి. దీంతో అక్కడ వ్యూపాయింట్‌ను నిర్మిస్తే బాగుంటుందని భావించి 2004లో అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ ప్రత్యేక శ్రద్ధతో ఆ మలుపు వద్ద వ్యూపాయింట్‌ను నిర్మించారు. దీంతో అక్కడే టీ, పాన్ దుకాణాలు కొన్నాళ్లు నడిచాయి. దీంతో ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి వచ్చే సందర్శకులు వ్యూపాయింట్ వద్ద ఆగి టీ తాగి, స్నాక్స్ కొనుక్కుని అక్కడి నుంచి ప్రకృతి అందాలను తిలకించేవారు.

కొన్నాళ్ల క్రితం అక్కడ దుకాణాలను పూర్తిగా తీసేశారు. అయినప్పటికీ ఏజెన్సీకి వచ్చే పర్యాటకులు కచ్చితంగా వ్యూపాయింట్ వద్ద కాసేపు ఆగి అక్కడి నుంచి ప్రకృతి అందాలను తిలకించడం, ఫొటోలు దిగడం చేస్తున్నారు.

మందుబాబులతో ఇబ్బందులు

ఘాట్‌లో అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉండే వ్యూపాయింట్ మందుబాబుల వల్ల అధ్వానంగా మారుతుండడంతో స్థానికులు, పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువకులు గుంపులుగా వచ్చి అక్కడే మద్యం సేవించడం, అనంతరం ఖాళీ సీసాలను అక్కడే పగులగొడుతుండడంతో అక్కడికి వచ్చే వారికి ఇబ్బందిగా మారింది. ఖాళీ వాటర్‌బాటిళ్లు, స్నాక్స్ తినేసిన తరువాత ఖాళీ కవర్లను అక్కడే పడేస్తున్నారు.

దీంతో వ్యూపాయింట్‌కు వచ్చే వారికి తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని పర్యాటకులు అంటున్నారు. కేవలం మందుబాబుల వల్ల వ్యూపాయింట్ కళావిహీనంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కళావిహీనంగా ఉన్న దానికి అధికారులు మెరుగులుదిద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

అమ్మఒడి, ఆసరా డబ్బు తినడమే కాదు..



అప్పుడప్పుడు అధికారులు చెప్పే మాట కూడా వినాలి

- వైసీపీ సభలకు రాకపోతే మీకు పథకాలు ఉండవు, మాకు ఉద్యోగాలు ఉండవు
- ఇళ్లలో పనులు చేసుకుంటారో... మానేస్తారో మాకు అనవసరం
- సీఎంకు స్వాగతం చెప్పడానికి రావాల్సిందే
- మహిళా సంఘాలకు యూసీడీ సిబ్బంది హుకుం
- మండుటెండలో మహిళల అగచాట్లు
- ప్రతి గ్రూపు సభ్యులు జాబితా చేతిలో పట్టుకుని మరీ హాజరు నమోదు
- ప్రతిసారీ పార్టీ కార్యక్రమాలకు రమ్మనడం సమంజసంగా లేదంటూ మహిళల గగ్గోలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

"కొద్దిరోజులు కిందట జరిగిన 'ఆడుదాం...ఆంధ్రా' కార్యక్రమానికి అధికారులు బస్సులు పెట్టారు. ఒక్కరూ రాలేదు. దీంతో కార్యక్రమం జనం లేక ఫెయిల్ అయ్యింది. సీఎంతో అధికారులు చీవాట్లు తినాల్సి వచ్చింది. అప్పుడు మనం చేసిన తప్పుకు ఇప్పుడు (బుధవారం) శిక్షగా రోడ్డుపక్కన నిలబడి మనం స్వాగతం పలకాలి. అందరినీ తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ నుంచి డైరెక్టుగా ఆదేశాలు వచ్చాయి. అందరూ రావాల్సిందే. ఉదయం తొమ్మిదయ్యేసరికి మనమంతా రోడ్డుపై ఉండాలి. పనులు ఉన్నాయని చెబితే కుదరదు. పనులు చేసుకుంటారో...పక్కనపెట్టేసి వస్తారో మాకు తెలియదు. గ్రూపు సభ్యులంతా రావాల్సిందే. ప్రభుత్వం ఇచ్చే అమ్మఒడి, ఆసరా వంటి పథకాలతో వచ్చే డబ్బు తినడమే కాదు...అప్పుడప్పుడు అధికారులు చెప్పే మాట కూడా వినాలి. లేకపోతే పథకాలు ఆపేస్తారు. మీరు రాకపోతే మీకు పథకాలు ఉండవు...మాకు ఉద్యోగం ఉండదు..ఉదయాన్నే కొళాయిలు కూడా ఇవ్వరు, కాబట్టి నీటి కోసం ఆలోచన చేయక్కర్లేదు."

- ఇదీ డ్వాక్రా సంఘాల గ్రూపుల్లో రీసోర్స్‌పర్సన్లు పెట్టిన మెసేజీ



విమానాశ్రయం వద్ద హైవేపై ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికేందుకు రావాలంటూ డ్వాక్రా సంఘాల సభ్యులపై రీసోర్స్ పర్సన్ల ద్వారా జీవీఎంసీ అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. కొద్దిరోజుల కిందట నగరంలో సీఎం పాల్గొన్న 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుక జనం లేక అట్టర్ ఫ్లాప్ అయింది. దీంతో అధికారులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేశారనే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మరోమారు చీవాట్లు తినకూడదని అధికారులు ముందుజాగ్రత్త పడ్డారు. బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు భారీగా జనాలను సమీకరించాలని నిర్ణయించారు. సీఎం ఎయిర్‌పోర్టులో దిగినప్పటి నుంచి చినముషిడివాడలో గల శారదా పీఠానికి చేరుకునేంత వరకూ దారిపొడవునా మహిళలను నిలబెట్టి ప్లకార్డులతో స్వాగతం పలకడం ద్వారా ఆయన మెప్పు పొందాలని భావించారు. దీనికోసం జీవీఎంసీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను తరలించాలని యూసీడీ అధికారులను ఆదేశించారు. ఒక్కో ఆర్పీ తన పరిధిలోని గ్రూపుల నుంచి కనీసం వంద మందిని తీసుకురావాలని టార్గెట్ విధించారు. దీంతో ఆర్పీలంతా సీఎంకు స్వాగతం

... మిగతా 8వ పేజీలో



శారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి (-వార్త మెయిన్ ఎడిషన్‌లో)

మీడియాపై దాడులను ఖండిస్తూ నిరసనలు



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టీడీపీ శ్రేణులు

జర్నలిస్టులు, మీడియా సంస్థలపై వైసీపీ నాయకుల దాడులను ఖండిస్తూ జిల్లాలో పలు చోట్ల బుధవారం నిరసన ప్రదర్శనలు జరిగాయి. పత్రికా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు హోరెత్తాయి. పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గూడెంకొత్తవీధిలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి కల్యాణి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.



ప్రపంచ సంస్కృతికి ప్రతిబింబం.. మిలాన్ గ్రామం

మిలాన్ గ్రామంలో పారిశ్రామిక ప్రదర్శనను తిలకిస్తున్న కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, తదితరులు

నావల్ డాక్‌యార్డులోని సముద్రిక ఆడిటోరియం సమీపాన ఏర్పాటు చేసిన మిలాన్ గ్రామాన్ని బుధవారం సాయంత్రం కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. కొత్త ఆవిష్కరణలను వివరించే పారిశ్రామిక ప్రదర్శనను ఆయన తిలకించారు. - వార్త 7లో



సమావేశంలో మాట్లాడుతున్న కాఫీ బోర్డు డీడీ రమేశ్

నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి కృషి చేయాలి

కాఫీ బోర్డు సేవలను వినియోగించుకోవాలి

గిరిజన రైతులకు డిప్యూటీ డైరెక్టర్ రమేశ్ సూచన

చింతపల్లి, ఫిబ్రవరి 21: అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, ప్రపంచ దేశాల డిమాండ్‌కు తగిన నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి గిరిజన రైతులు కృషి చేయాలని కేంద్ర కాఫీ బోర్డు పాడేరు డిప్యూటీ డైరెక్టర్ సామల రమేశ్ అన్నారు. బుధవారం స్థానిక కాఫీ బోర్డు కార్యాలయంలో చింతపల్లి, జీకేవీధి మండలాల కాఫీ రైతులు, కాఫీ కార్మిక విద్యార్థులతో సమగ్ర కాఫీ అభివృద్ధి ప్రాజెక్టు, మధ్యంతర ప్రణాళిక కాలంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్‌లో అరకు కాఫీ గింజలకు మంచి డిమాండ్ ఉన్నదన్నారు. అయితే అరకు కాఫీ కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చే వర్తకుల డిమాండ్‌కు తగిన ఉత్పత్తులు ఏజెన్సీలో లభించడం లేదన్నారు. దీనికి ప్రధాన కారణం రైతులు సాగులో మెలకువలు పాటించకపోవడం వల్ల తక్కువ దిగుబడులు పొందడంతో పాటు గింజల్లో నాణ్యత లోపం అధికంగా ఉంటుందన్నారు. జిల్లాలో 2022-23లో గిరిజన రైతులు 12 వేల మెట్రిక్ టన్నుల కాఫీ ఉత్పత్తులు సాధించారన్నారు. ఈ ఏడాది 14 వేల మెట్రికట్ టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. ప్రపంచ దేశ వర్తకులకు రూ.లక్షల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలు అవసరమని చెప్పారు. గిరిజన ప్రాంతంలో ఈ స్థాయిలో కాఫీ దిగుబడులు లేవన్నారు. నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నామని, రైతులు కాఫీ బోర్డు సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కాఫీ కార్మిక విద్యార్థినీ, విద్యార్థులను కాఫీ బోర్డు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేఎల్‌వో ఎస్.ప్రదీప్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు పాత్రుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమణ, ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్ఎస్‌వీ రమణమూర్తి, ఉద్యానశాఖ అధికారి అరుణ కుమారి, మ్యాక్స్ చైర్మన్ సెగ్గె కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ బాధ్యతల నుంచి అమర్‌కు ఉద్వాసన?

ఉప ముఖ్యమంత్రి బూడికి అవకాశం



మంత్రి అమర్‌నాథ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మరో షాక్ తగిలింది. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటివరకూ టికెట్ కేటాయించని అధిష్ఠానం తాజాగా ప్రొటోకాల్ బాధ్యతలనుంచి కూడా ఆయన్ను తప్పించింది. విశాఖపట్నానికి వీవీఐపీలు ఎవరు వచ్చినా వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున విమానాశ్రయంలో స్వాగతం పలికే ప్రొటోకాల్ బాధ్యతలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిర్వహిస్తున్నారు. గతంలో రాష్ట్రపతి వచ్చినప్పుడు కూడా ఆయనే స్వాగతం పలికారు. అయితే ఆకస్మికంగా ఆయన్ను తప్పించి, ఉమ్మడి జిల్లాకు చెందిన మరో మంత్రి బూడి ముత్యాలనాయుడుకు ఆ బాధ్యత అప్పగించారు. ఇది వైసీపీ వర్గాల్లో చర్చకు దారితీసింది.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

కలెక్టర్ విజయ సునీత

అరకులోయ, ఫిబ్రవరి 21: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. బుధవారం ఉదయం పాడేరు ఐటీడీఏ పీవో, అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అభిషేక్‌తో కలిసి ఆమె అరకులోయలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అరకు నియోజకవర్గంలో మొత్తం 306 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇందులో 16 అత్యంత సమస్యాత్మక, 100 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సచివాలయం, ఆర్బీకే కేంద్రం, సామాజిక భవనం అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవోకు పలు సూచనలు చేశారు.



అరకులోయ తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్

గిరిజనాభివృద్ధికి కృషి

జిల్లాలో గిరిజనాభివృద్ధికి కృషి చేసి, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ విజయ సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఆమె వెంట టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎంపీడీవో వెంకటేశ్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

95 డిటోనేటర్లు స్వాధీనం

మావోయిస్టులకు పేలుడు సామగ్రి అందిస్తున్న ఇద్దరి అరెస్టు

చింతూరు, ఫిబ్రవరి 21: మావోయిస్టులకు పేలుడు సామగ్రి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అందించిన వివరాలు ప్రకారం.. ఒడిసా రాష్ట్రం, మల్కాన్‌గిరి జిల్లా అనంతపల్లికి చెందిన నక్కా దావీదు, అలియాస్ డేవిడ్ రాజు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పట్నంపారాకు చెందిన బీమాల్ విశ్వాస్ తెలంగాణ రాష్ట్రం నుంచి వయా చింతూరు మండలం మీదుగా పేలుడు సామగ్రిని తరలించే యత్నం చేశారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో వారి వద్ద పేలుడు సామగ్రి లభ్యమైందని ఏఎస్పీ చెప్పారు. పేలుడు సామగ్రిని మావోయిస్టులకు చేరవేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు వెల్లడైందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 95 డిటోనేటర్స్, 15 మీటర్ల ఫ్యూజ్ వైర్, 190 జెలిటిన్ స్టిక్స్, మావోయిస్టులు రాసి ఇచ్చిన పేలుడు సామగ్రి లిస్టు, రూ. 13 వేల ... మిగతా 8వ పేజీలో



పోలీసులు స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

అడుగడుగునా గోతులు, గతుకులు

అధ్వానంగా 'నాతవరం' రహదారులు

నాతవరం, ఫిబ్రవరి 21:

నాతవరం మండలంలో పలు ప్రధాన రహదారులకు ఐదేళ్ల నుంచి ఎలాంటి నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రూపురేఖలు మారిపోయి అధ్వానంగా తయారయ్యాయి. గోతులు, గతుకులతో నిండి ఈ రహదారులపై ప్రయాణిస్తుంటే ఒళ్లుహూనం అవుతున్నదని ప్రజలు వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారిలో పలువురు వెన్నెముక సంబంధ సమస్యలతో ఆస్పత్రి పాలవుతున్నారు.

- ఐదేళ్లుగా నిర్వహణను గాలికొదిలేసిన ప్రభుత్వం
- పలుచోట్ల పూర్తి ఛిద్రమైన తుని-నర్సీపట్నం రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ఐదు జిల్లాల ప్రయాణికులు
- ఇదే రోడ్డులో ఆర్‌అండ్‌బీ మంత్రి నియోజకవర్గం
- అయినా పట్టించుకోని అమాత్యులు, అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు
- వర్షాకాలం వచ్చేలోగా గోతులైనా కప్పాలని వినతి



నర్సీపట్నం-తుని మధ్య ఎ.శరభవరం వద్ద ఆనవాళ్లు లేని తారు రోడ్డు

నాతవరం మండలం మీద నుంచి వెళుతున్న తుని-నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రహదారిపై అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లి ప్రాంతాలు, అనకాపల్లి జిల్లా మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల ప్రజలు కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ రోడ్డు మీదుగానే తుని రైల్వే స్టేషన్‌కు వెళుతుంటారు. అదే విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు కూడా అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు ఈ మార్గంలోనేవచ్చిపోతుంటారు. నిరంతరం రద్దీగా వుండే ఈ రోడ్డు నిర్వహణను ఆర్‌అండ్‌బీ అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. పలుచోట రోడ్డు మొత్తం గోతులు ఏర్పడి తారురోడ్డు ఆనవాళ్లు లేకుండా పోయింది. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రాతినిధ్యం వహిస్తున్న తుని నియోజకవర్గంలో రెండు మండలాల మీదుగా ఈ రహదారి వెళుతుంది. అయినప్పటికీ ఈ రోడ్డు దుస్థితిని ఆయన పట్టించుకోవడంలేదని ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

మండలంలో వెన్నలపాలెం (తాండవ జంక్షన్) నుంచి తాండవ జలాశయం వద్దకు వెళ్లే రహదారి అడుగడుగునా గోతులు ఏర్పడి, రాళ్లు తేలాయి. మొత్తం 14 కిలోమీటర్ల పొడవు వున్న ఈ రోడ్డులో తాండవ జంక్షన్ నుంచి నాతవరం వరకు ఆర్‌అండ్‌బీ పరిధిలో, నాతవరం నుంచి తాండవ డ్యామ్ వరకు ఇరిగేషన్ శాఖ పరిధిలో వుంది. ఇరు శాఖల అధికారులు నిధులు లేవంటూ ఈ రహదారి నిర్వహణను పట్టించుకోవడం మానేశారు. గతంలో రెండు పర్యాయాలు టీడీపీ, జనసేన నాయకులు వేర్వేరుగా సొంత సొమ్ముతో గోతులు కప్పించారు. వర్షాలతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో నాతవరంతోపాటు కొయ్యూరు మండలంలోని కొన్ని పంచాయతీల ప్రజలు నాతవరం, నర్సీపట్నం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో మన్యపురట్ల-ఉప్పరగూడెం మధ్య పంచాయతీరాజ్ శాఖకు చెందిన తారురోడ్డు కూడా గోతులు ఏర్పడి ఛిద్రంగా మారింది. ఈ మార్గంలో ఉప్పరగూడెం, కొత్తనాయుడుపాలెం, లింగంపేట, రాజుపేట అగ్రహారం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సులు నడపడంలేదు. దీంతో ప్రయాణికులు ఆటోలపై ఆధారపడాల్సి వస్తున్నది. గోతుల కారణంగా ప్రయాణ సమయం రెట్టింపు కావడమే కాకుండా ఆటోలు పాడైపోతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. ఇంకా గొలుగొండపేట-వెదురుపల్లి తారు రోడ్డు కూడా బాగా పాడైంది. దీంతో నర్సీపట్నం ఆర్టీసీ డిపో అధికారులు మూడేళ్ల క్రితం బస్సు సర్వీసును రద్దు చేశారు. రానున్న మూడు నెలలు వర్షాలు పడవు కాబట్టి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులను బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అడుగడుగునా గోతులతో నిండిన గొలుగొండపేట-వెదురుపల్లి రహదారి



సగానికిపైగా ఛిద్రమైన మన్యపురట్ల- ఉప్పరగూడెం రోడ్డు

వర్షాకాలం వచ్చేలోగా గోతులైనా పూడ్చండి



మన్యపురట్ల నుంచి కొత్తనాయుడుపాలెం, ఉప్పరగూడెం మీదుగా తుని- నర్సీపట్నం రోడ్డులో శరభవరం జంక్షన్ వరకు ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాను. సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం వున్న ఈ రోడ్డు మొత్తం పాడైపోయింది. పలుచోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనివల్ల ఆటో విడిభాగాలు పాడై తరచూ మరమ్మతులకు గురవుతున్నది. ఆటో డ్రైవర్లతోపాటు ప్రయాణికులు కూడా ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలం వచ్చేలోపు కనీసం గోతులు అయినా పూడ్చాలని అధికారులను కోరుతున్నాను.

- కీర్తి రామకృష్ణ, ఆటో డ్రైవర్, మన్యపురట్ల

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

» మరొకరికి గాయాలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 21: మండలంలోని పురుషోత్తపురం జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్టు రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రుక్మిణీపురం గ్రామానికి చెందిన ఆర్.సత్యనారాయణ(67), అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై పురుషోత్తపురంలో జరిగే వారపు సంతకు బయలుదేరారు. జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో సత్యనారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను అనకాపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆ వాహనం వెనుక సీట్లో కూర్చున్న వ్యక్తికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గో రక్షణ పేరుతో డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 21: మండలంలో గో రక్షణ పేరుతో జాతీయ రహదారిపై వెళుతున్న పశువుల వాహనాలను వెంబడించి గో రక్షణ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు అందిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన గిరీష్ అనే వ్యాన్ డ్రైవర్ ఈ నెల 18న శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నుంచి తుని సంతకు పశువులను తరలిస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో మండలంలోని పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై కొందరు వాహనాన్ని నిలిపారు. తాము గో రక్షణ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులమని చెప్పి తన వద్ద నుంచి రూ.5 వేలు దౌర్జన్యంగా తీసుకున్నారని వ్యాన్ డ్రైవర్ గిరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గో రక్షణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొర్ల దేముడుతో పాటు మరో ఆరుగురిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. కాగా తమపై శ్రీను, చిన్న అనే ఇద్దరు వ్యక్తులు దాడి చేశారంటూ గో రక్షణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొర్ల దేముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

48 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 21: తానాం గ్రామంలో ఓ పాన్‌షాపుపై దాడులు చేసి 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపారు. ఆ గ్రామానికి చెందిన సిరపు వెంకటలక్ష్మి పాన్‌షాపులో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో బుధవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. షాపు యజమాని వెంకటలక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

90 లీటర్ల నాటుసారాతో ఒకరి అరెస్టు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 21: మండలంలోని నీలకంఠాపురంలో 90 లీటర్ల నాటుసారాతో ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. నీలకంఠాపురంలో నాటుసారా అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని, సారా విక్రయిస్తున్న యన్నంశెట్టి చెల్లంనాయుడును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని, అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి నిందు రిమాండ్‌కి తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

శారదా నదిలో మునిగి వ్యక్తి మృతి

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21: శారదా నదిలో స్నానానికి దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ టైలర్‌పేటకు చెందిన బంగారు దుర్గాప్రసాద్, కుమారుడు దిలీప్ ఈ నెల 17వ తేదీన అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం ఇద్దరూ కలిసి సమీపంలోని శారదా నదిలో స్నానానికి వెళ్లారు. దుర్గాప్రసాద్ నదిలో దిగుతుండగా జారిపడి నీటిలో మునిగిపోయాడు. ఒడ్డున వున్న దిలీప్ వెంటనే తుమ్మపాలలో బంధువుల వద్ద వెళ్లి చెప్పాడు. వారు వచ్చి గాలించినప్పటికీ ఆచూకీ లభ్యంకాలేదు. కళాగా బుధవారం మధ్యాహ్నం నదిలో దుర్గాప్రసాద్ మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, మృతుడి భార్య సంతోషి నూకలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21: ప్రయాణికుల ముసుగులో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం అర్ధరాత్రి ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. చెన్నైకు చెందిన శంకర్ పాండే, శర్వణ్‌పాండే, ఖాదర్ వల్లీ అనే వ్యకులు ఏజెన్సీ నుంచి మధురైకు 18 కిలోల గంజాయి తరలిస్తున్న క్రమంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ నవీన్‌కు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.

ఏడు ఎకరాల్లో సరుగుడు, ఆయిల్ పామ్ తోటలు దగ్ధం



దగ్ధమైన సరుగుడు తోట

దేవరాపల్లి, ఫిబ్రవరి 21: మండలంలోని వాలాబు శివారు చిప్పగరువు వద్ద ఏడు ఎకరాల్లో సరుగుడు, ఆయిల్‌పామ్ తోటలు దగ్ధమయ్యాయి. తన రెండు ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు కాలిపోయాయని బల్లి దేముడమ్మ వాపోయింది. దుప్పి జమ్ములమ్మకు చెందిన ఐదు ఎకరాల సరుగుడు తోట కాలిపోయింది. ఇటీవల రూ.10 లక్షలకు అడిగారని, ఇంకా ఎక్కువ ధర వస్తుందన్న ఉద్దేశంతో విక్రయించలేదని చెప్పారు. కాగా ఆయిల్‌పామ్, సరుగుడు తోటలకు మంటలు ఎలా అంటుకున్నాయో తెలియదని బాధిత మహిళా రైతులు వాపోయారు.

పాత్రికేయులపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ

» టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ మూర్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 21: అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కర్నూలులో ఈనాడు సంస్థల కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసన సభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ అవినీతి సొమ్ముతో సాక్షి పత్రిక నెలకొల్పారన్నారు. రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలో రానున్నదని, అప్పుడు సాక్షి సోదరులకు ఎవరు భద్రత కల్పిస్తారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత సాక్షి పత్రిక పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. వ్యక్తిగత పనిమీద శారదా పీఠానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వస్తే రోడ్డు మీద ప్రజలకు ఆంక్షలు ఏమిటని ప్రశ్నించారు. ఈవెంట్ మేనేజర్లను నియమించి ఎండలో రోడ్డుపై ప్రజలను బారులుదీరేలా నిల్చోపెట్టడం తగదని బండారు అన్నారు. ముఖ్యమంత్రి వస్తే నగరంలో కర్ఫ్యూ లాంటి వాతావరణ నెలకొంటోందని, ఇందుకు విశాఖ ప్రజలకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విశాఖకు ఎన్ని పరిశ్రమలు తీసుకు వచ్చారో చెప్పాలని కోరారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి గాలిలో ఉందని , ఆయనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించలేదన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు కంట్రోల్‌రూమ్: జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 21: ఈ నెల 25వ తేదీన నిర్వహించే ఏపీపీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్టు జాయింట్ కలెక్టర్ జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 08924 - 22888 నంబరుకు ఫోన్ చేసి పరీక్షలకు సంబంధించిన సమాచారం పొందవచ్చన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డు తగదు

» జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు



జీవీఎంసీ జోన్ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతున్న నాగబాబు

అనకాపల్లి, ఫిబ్రవరి 21: పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డును కొనసాగించడం దారుణమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. బుధవారం జీవీఎంసీ వద్ద గల డంపింగ్‌యార్డును జనసేన నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఇక్కడ ఉండడం వల్ల పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా ఉన్నాయన్నారు. చెత్త నుంచి సంపద తయారీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉందని, రాష్ట్రం సైతం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డంపింగ్ యార్డు తరలింపుపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే సమీపంలో ఉండే ప్రజలు నాగేంద్రబాబుకు వినతిపత్రాలను అందజేశారు. ప్రధానంగా డంపింగ్‌యార్డు సమస్యను సమీపంలో ఉండే ప్రజల తరపున విభిన్నప్రతిభావంతుల సంఘం నాయకుడు పాత్రపల్లి వీరయాదవ్ నాగేంద్రబాబుకు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సాగునీటి వనరులు ధ్వంసం



ఉమ్మలాడ వద్ద శారదా నది గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న నాగబాబు

మునగపాక, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో సాగునీటి వనరులను వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఆరోపించారు. బుధవారం ఉమ్మలాడ వద్ద శారదానది గ్రోయిన్‌ను ఆయన పరిశీలించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జులు సుందరపు విజయ్‌కుమార్, పరుచూరి భాస్కరరావులు ఆయనకు గ్రోయిన్ల వ్యవస్థ గురించి వివరించారు. శారదా నదిపై దెబ్బ తిన్న గ్రోయిన్లకు వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదని తెలిపారు. గ్రోయిన్ల మరమ్మతుల కారణంగా దిగువ ఆయకట్టు సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని చెప్పారు. శారదానది గట్టును పటిష్ఠం చేయాలని రైతాంగం కోరుతున్నప్పటికీ ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. జనసేన, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ గ్రోయిన్ల వ్యవస్థను అభివృద్ధి చేస్తామని నాగబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పావాడ కామరాజు, మొల్లేటి ఆనంద్, ఆదారి శ్రీకాంత్, ఏపీ సత్యనారాయణ, కె.చంద్రమోహన్, కాశీ, పల్లెల నరసింగరావు, పవన్, వాసు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మొల్లేటి నారాయణరావు, కాండ్రేగుల సత్తిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.



ఏటికొప్పాక హస్త కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న నాగబాబు

ఏటికొప్పాకలో నాగబాబు..

ఎలమంచిలి, ఫిబ్రవరి 21: ఏటికొప్పాక గ్రామంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు సందడి చేశారు. బుధవారం ఆ గ్రామానికి చేరుకుని బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని హస్తకళాకారుల కాలనీని, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చిన్నయాచారి హస్తకళా కేంద్రాన్ని సందర్శించి కళాఖండాలను పరిశీలించారు. చిన్నయాచారి రూపొందించిన హస్త కళాఖండాలను, సూక్ష్మ కళాఖండాలను పరిశీలించి సత్కరించారు.

ప్రశ్నించే గళం అంటే జగన్‌రెడ్డికి వణుకు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21: ప్రశ్నించే గళం అంటే జగన్‌రెడ్డికి వణుకు పుడుతుందని, అందుకే మీడియాపై దాడులు చేయిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. వైసీపీ రౌడీ మూకలు మీడియా సంస్థలు, మీడియా ప్రతినిధులపై చేస్తున్న దాడులను ఖండిస్తూ బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లే వైసీపీ కార్యకర్తలు మీడియా ప్రతినిధులు, సంస్థలపై దాడులకు తెగబడుతున్నారని ఆయన అన్నారు. జగన్‌రెడ్డి ప్రతి సభల్లో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 మీడియా సంస్థల పేర్లు లేవనెత్తకుండా సభలు ముగించలేని దాఖలాలు లేవన్నారు. యదార్థాలు రాసే ఈ సంస్థలపై ఆయనకు అక్కసు అని బుద్ద వ్యాఖ్యానించారు. జగన్‌రెడ్డి సభల్లో చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను ఏక వచనంతో మాట్లాడుతూ వారి ఫొటోలు, ఫ్లెక్సీలు పెట్టించి చెప్పులతో తన్నించి చూడడం అతని సైకో తత్వానికి నిదర్శనమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.

మీడియాపై దాడులను ఖండిస్తూ ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు, మీడియా సంస్థలపై వైసీపీ శ్రేణుల దాడులను ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం ధర్నా చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి, మీడియాపై దాడులను అరికట్టాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి వెంకటేశ్, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బి.కొండలరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగశ్రీను, పి.రామారావు, సీనియర్ పాత్రికేయులు బాషా, తిమ్మాపాత్రుని రమేశ్, కె. మోహనబాబు, కె.చంద్రశేఖర్, గంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సంస్కృతికి ప్రతిబింబం...మిలాన్ గ్రామం

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో వివిధ దేశాల సంస్కృతీ సంప్రదాయాలకు వేదికగా నిలిచే 'మిలాన్ గ్రామం'ను కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. నావల్ డాక్‌యార్డులోని సముద్రిక ఆడిటోరియం సమీపాన ఏర్పాటుచేసిన దీనిని మంత్రి బుధవారం సాయంత్రం ప్రారంభించి నేవీ కుటుంబాలకు ఆహ్వానం పలికారు. ఇక్కడ భారతీయ వంటకాలే కాకుండా మిలాన్‌లో పాల్గొంటున్న 50 దేశాలకు చెందిన వంటకాలు, వస్తువులు, దుస్తులు, సంగీత పరికరాలు ప్రదర్శనకు పెట్టారు. మిత్రుల అలవాట్లు, అభిరుచులు తెలుసుకుంటూ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించుకుంటూ స్నేహ సంబంధాలు పెంచుకోవడమే మిలాన్ లక్ష్యం కావడంతో ఈ గ్రామంలో వాటికి సంబంధించిన అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కేంద్ర మంత్రి కూడా ఆసక్తిగా అన్నింటిని తిలకించి, ఆసక్తికరమైన వాటిని అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రక్షణ శాఖ పారిశ్రామిక ప్రదర్శన

రక్షణ రంగంలో వస్తున్న మార్పులు, అందుబాటులో ఉన్న పరికరాలు, కొత్త ఆవిష్కరణలను వివరించే పారిశ్రామిక ప్రదర్శనను కూడా రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఎల్ అండ్ టి, భారత్ ఎలక్ట్రానిక్స్, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, డిఫెన్స్ స్టార్టప్స్, డీఆర్‌డీఓ, తదితర సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు పెట్టాయి. ఇది మూడు రోజులు ఉంటుంది. ఈ ప్రదర్శనలో ఉంచిన ఒక కొత్త తుపాకీని రక్షణ శాఖా మంత్రి ఆసక్తిగా తిలకించి, దాని గురించి అడిగి తెలుసుకొని, లక్ష్యానికి గురిపెట్టి పనితీరు పరీక్షించారు.

మాఘ పౌర్ణమి జాతరకు 35 ప్రత్యేక బస్సులు

» నర్సీపట్నం డిపో మేనేజర్ ఎమ్ఎస్ఎస్ ధీరజ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 21: మండలంలోని రేవు పోలవరం సముద్రతీరం వద్ద ఈ నెల 24న జరిగే మాఘ పౌర్ణమి జాతరకు నర్సీపట్నం డిపో నుంచి మొత్తం 35 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు బుధవారం నర్సీపట్నం డిపో మేనేజర్ ఎమ్ఎస్ఎస్ ధీరజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచి 24వ తేదీ సాయంత్రం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. నర్సీపట్నం నుంచి రేవుపోలవరం గ్రామానికి పది బస్సులు, అడ్డరోడ్డు నుంచి రేవు పోలవరానికి ఇరవై, కొడవటిపూడి నుంచి రేవుపోలవరానికి రెండు, అలాగే కర్రివానిపాలెం నుంచి రేవుపోలవరానికి మూడు బస్సులు నడుపుతామని చెప్పారు.

అనకాపల్లి డిపో నుంచి పూడిమడకకు 35 ప్రత్యేక బస్సులు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21: మాఘపౌర్ణమి జాతర సందర్భంగా పూడిమడకకు ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచి 24వ తేదీ సాయంత్రం వరకు అనకాపల్లి డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారిణి కె. పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎలమంచిలిలో జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 21: అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఫలితాలను బుధవారం జిల్లా సెక్రటరీ కొఠారు నరేష్ ప్రకటించారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ఆదారి వీరునాయుడు, ప్రధాన కార్యదర్శిగా కొఠారు నరేష్, ఉపాధ్యక్షులుగా ఏపీఎల్ రాజు, రాంబాబు, కల్పన, జాయింట్ సెక్రటరీలుగా కృష్ణవేణి, యమున, రమేశ్, తేజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఎన్నికల పరిశీలకుడిగా రవిరాజు వ్యవహరించినట్టు చెప్పారు.

జి.కొత్తపల్లిలో జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు



పోటీల్లో పరుగులు తీస్తున్న ఎద్దులు

చీడికాడ, ఫిబ్రవరి 21: మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు 15 జతల ఎడ్లతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. పరవాడ నాయుడుబాబు (అర్జునగిరి) ఎద్దులు మొదటి స్థానంలో, మజ్జి దేవానందం (చుక్కపల్లి) ఎద్దులు రెండో స్థానంలో , అంజనేయస్వామి (కేజేపురం) ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ఓటమి భయంతోనే మీడియాపై దాడులు

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్

కొయ్యూరు, ఫిబ్రవరి 21: వాస్తవాలను వెలికితీస్తే ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ ప్రభుత్వం మీడియాపై దాడులు చేయిస్తున్నదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ ధ్వజమెత్తారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాప్తాడు సభ వద్ద ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి తెగపడడం, కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడి చేయడం సరికాదన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం దాడులకు ప్రోత్సహించడం అమానుషమన్నారు. ప్రభుత్వ అరాచకాలను వెలుగులోకి తెస్తున్న ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలను సీఎం టార్గెట్ చేసి ఆర్థిక, అంగ బలంతో క్యాడర్‌ను ఉసిగొల్పుతున్నారన్నారు. సీఎం జగన్ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అతని వెంట పార్టీ నేతలు జి.శ్రీరామూర్తి, గోవింద్, నాగేశ్వరరావు ఉన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ: టీఎన్ఎస్ఎఫ్ నేత కల్యాణి

గూడెంకొత్తవీధి: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి కల్యాణి అన్నారు. మండల కేంద్రంలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభంగా పిలువబడే జర్నలిజానికి కలంకం తెచ్చేలా వైసీపీ ప్రభుత్వం, జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. ఆంధ్రజ్యోతి విలేకరులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. బాధ్యులపై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నేత మహేశ్ పాల్గొన్నారు.

బహుభాషా ఉపాధ్యాయులను నియమించాలని నిరసన


గరిమండ పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కొయ్యూరు, ఫిబ్రవరి 21: ఆదివాసీ గ్రామాల్లో బహుభాషా ఉపాధ్యాయులను పూర్తి స్థాయిలో నియమించాలని ఆదివాసీ విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బూదరాళ్ల పంచాయతీలోని గరిమండ పాఠశాల వద్ద నిరసన తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభంలోనే సీఆర్టీలను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ఆదివాసీ విద్యార్థులు మాతృ భాషలో సులభంగా చదవడం, రాయడం నేర్చుకుంటారన్నారు. లేనిపక్షంలో భాష తెలియక డ్రాపౌట్లుగా మిగిలిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శుల నియామకం


వెంకటరావు... అశోక్‌లాల్

కొయ్యూరు, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బూరుగు వెంకటరావు, ఎస్.అశోక్‌లాల్‌ను నియమించారు. పార్టీ అరకు మండల అధ్యక్షుడు అప్పనదొర ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించి మండల కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వెంకటరావు, అశోక్‌లాల్‌లను అధ్యక్ష, కార్యదర్శులుగా నియమించినట్టు అప్పనదొర ప్రకటించారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని, మండలంలో పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

స్వల్పంగా కనిష్ఠ ఉష్ణోగ్రతల పెరుగుదల

» అరకులోయలో 10.9 డిగ్రీలు

పాడేరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. అయితే చలితో పాటు పొగమంచు సైతం కొనసాగుతున్నది. అరకులోయలో 10.9, జి.మాడుగులలో 12, పాడేరులో 12.2, పెదబయలులో 12.4, హుకుంపేటలో 13, ముంచంగిపుట్టులో 13.2, డుంబ్రిగుడలో 15.7, కొయ్యూరులో 16, అనంతగిరిలో 16.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. దీంతో మన్యంలోని కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురవగా, పలు ప్రాంతాల్లో పొగమంచు జాడలేదు. అలాగే మధ్యాహ్నం వేళల్లో ఎండ ప్రభావం కాస్త పెరిగింది.

చింతపల్లిలో..


చింతపల్లి రహదారిలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మండలంలో చలి తీవ్రత కొనసాగుతోంది. బుధవారం చింతపల్లిలో 11.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటల వరకు చలి అధికంగా ఉంటున్నది. ప్రస్తుతం పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. 31.5- 32 డిగ్రీలు మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతున్నది. అయితే చలితో పాటు ఉదయం వేళల్లో మంచు అధికంగా కురుస్తున్నది.

అమ్మఒడి, ఆసరా
డబ్బు తినడమే కాదు...

... 5వ పేజీ తరువాయి

పలికేందుకు తప్పనిసరిగా రావాల్సిందేనని తమ పరిధిలోని మహిళా సంఘాల గ్రూపుల్లో వాయిస్ మెసేజ్‌లు పెట్టారు. దీంతో సభ్యులంతా తప్పదన్నట్టు ఉదయాన్నే ఎనిమిదిన్నరకు తమ ఇళ్ల వద్దకు వచ్చిన ఆటోలు ఎక్కి బయలుదేరారు.

షెడ్యూల్ ప్రకారం సీఎం జగన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని రోడ్డు మార్గంలో శారదా పీఠానికి వెళ్లాలి. అందుకే ఉదయం తొమ్మిది గంటలకే మహిళలను సంబంధిత ఆర్పీలు, ఏపీఎంలు తమకు కేటాయించిన ప్రాంతానికి తీసుకువెళ్లి రోడ్డుపక్కన నిలబెట్టారు. అయితే సీఎం ఎయిర్‌పోర్టులో దిగిన తర్వాత గంట ఆలస్యంగా అక్కడ నుంచి బయలుదేరారు. అప్పటికే గంటల తరబడి ఎండలో నిలబడిన మహిళలు ఎండ తీవ్రతకు ఇబ్బందిపడ్డారు. తమ చేతిలో ఉన్న ప్లకార్డులను అడ్డంపెట్టుకుని ఫుట్‌పాత్‌లపైనే కూర్చుండిపోయారు. మరికొందరు సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి ఎండ నుంచి సేదతీరారు. యూసీడీ సిబ్బంది మహిళా సంఘాల సభ్యుల వివరాలతో కూడిన జాబితాను చేతిలో పట్టుకుని మరీ వచ్చినవారి హాజరు తీసుకోవడం కనిపించింది. గ్రూపుల వారీగా ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. మహిళలను సమీకరించడంతోపాటు వచ్చినవారు తిరిగి వెనక్కి వెళ్లిపోకుండా ఆపేందుకు వీలుగా ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో ఏపీడీ, పీడీతోపాటు జోనల్ కమిషనర్లకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

ఇదిలావుంటే సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలు మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో అధికారుల తీరును తూర్పారబట్టారు. సీఎం వస్తే పార్టీ కార్యకర్తలను తీసుకువెళ్లాలిగానీ, ప్రతిసారీ తమనే రావాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని గోపాలపట్నం జంక్షన్‌లో నిలబడిన ఒక మహిళ నిలదీశారు. మహిళలకు సంబంధించిన కార్యక్రమాలకు తమను పిలిస్తే ఇబ్బందిలేదుగానీ, ఆటల పోటీల ముగింపునకు, ఇతరత్రా కార్యక్రమాలకు సీఎం వస్తున్నారని ప్రతిసారీ తమనే తరలించడం వల్ల కుటుంబపరంగా ఇబ్బందులు పడుతున్నామని బాజీ జంక్షన్‌లో నిలబడిన మహిళలు కొందరు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారని, వస్తే ఇంట్లో పనులు ఆగిపోతున్నాయని మరికొందరు మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

» పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో మీడియాపై దాడులకు నిరసన

పాడేరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణులు తమకు వ్యతిరేకంగా వున్న జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులకు పాల్పడుతున్న నైనాలతో ప్రజాస్వామ్యానికి ముప్పని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మీడియాపై వరుస దాడుల నేపథ్యంలో బుధవారం ఆమె టీడీపీ శ్రేణులతో కలిసి స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వైసీపీ మూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలపై రాష్ట్ర గవర్నర్ సుమోటాగా తీసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టు సంఘాలు ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకుని, వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. వైసీపీ పాలనలో జర్నలిస్టులకే రక్షణ లేని పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఇక సామాన్యుల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని పేర్కొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గంగపూజారి శివకుమార్, గబ్బాడ సింహాచలం, డప్పోడి వెంకటరమణ, డి.విశ్వనాథం, బుక్కా జగదీశ్, కిల్లు రాధాకృష్ణ, సుమన్, కోటిబాబు, అశ్విన్‌కుమార్, అనిల్‌కుమార్, లింగమూర్తి పాల్గొన్నారు.

మీడియాపై దాడులు ఆపాలి: బీజేపీ నేత రవికుమార్

మీడియాపై వైసీపీ ప్రభుత్వం దాడులను ఆపాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళుతున్నారనే అక్కసుతోనే జర్నలిస్టులపై, పత్రికా కార్యాయాలపై వైసీపీ మూకలు దాడులకు పాల్పడడం తగదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దోరణులు సరికాదని, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, తమకు వ్యతిరేకంగా వున్న మీడియాపై దాడులకు ప్రోత్సహించడం ఘోరమన్నారు.

మీడియాపై దాడులు అనాగరికం: సీపీఎం నేత అప్పలనర్స


విలేకరులతో మాట్లాడుతున్న అప్పలనర్స, పక్కన నేతలు సుందరరావు, దాసు

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే మీడియాపై దాడులకు పాల్పడడం అనాగరికమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుల తప్పులు, వైఫల్యాలను ఎత్తిచూపే బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. విధుల్లో భాగంగానే ప్రభుత్వం తప్పులను వెలుగులోకి తీసుకువస్తున్న వారిపై దాడులకు పాల్పడడం సరికాదన్నారు. మొన్న రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి, తాజాగా కర్నూలు జిల్లాలో మద్దికేర 'ఆంధ్రజ్యోతి' విలేకరి వీరశేఖర్‌పై, కర్నూలు 'ఈనాడు' కార్యాలయంపై వైసీపీ మూకలు దాడులకు తెగబడడం ఘోరమన్నారు. ఈ చర్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తున్నదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నిరంకుశ చర్యలకు పాలకులు స్వస్తి పలకకుంటే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, దాసు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి: ఐటీడీఏ పీవో అభిషేక్


కిల్లోగుడ పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 21: జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఏ నెలలో ఎన్ని డెంగ్యూ, మలేరియా జ్వరాలు నమోదయ్యాయని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందిత మాట్లాడుతూ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో మందులు నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. త్వరలోనే దోమల నివారణ మందు పిచికారీ పనులు చేపడతామన్నారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి వైద్య సేవలు సక్రమంగా అందించాలని ఆదేశించారు.

విద్యార్థుల భవితకు పునాదులు వేయండి

ప్రాథమిక దశలోనే విద్యార్థుల ఉన్నత భవితకు పటిష్ఠమైన పునాదులు వేయాలని పీవో అభిషేక్ సూచించారు. సాగర గ్రామంలో రూ.5.9 లక్షలతో ఆధునీకరించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐటీడీఏ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను ఉన్నతంగా చదివించాలని తల్లిదండ్రులకు పీవో సూచించారు. బడి ఈడు పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, ఏఈ అభిషేక్, సర్పంచ్ తౌడమ్మ, ఎంపీటీసీ సభ్యులు దేవదాసు, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు జరిగిన అన్యాయాలను, జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మద్దతుగా, రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరు యాత్ర వాహనాలకు బుధవారం జిల్లా కేంద్రం పాడేరులో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కురసా ఉమామహేశ్వరరావు, సల్లా రామకృష్ణ, రామవేద్రరావు, కూడా కృష్ణారావు, బి.ధర్మరాజు, కురసా పార్వతమ్మ, ఎస్.వేమన బాబు, బి.మూర్తి, జికొండబాబు, పి.ఈశ్వరరావు, ఎన్.ఉమామహేష్, ఎన్.శివ, సుబ్బారావు పాల్గొన్నారు.

వంద రోజుల పని దినాలు కల్పించండి

చింతపల్లి, ఫిబ్రవరి 21: గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఎంపీడీవో వీరసాయి బాబు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి పథకం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 2023-24 సంవత్సరానికి గుర్తించిన నూతన పనులకు ప్రాధాన్య క్రమంలో చేపట్టాలన్నారు. ప్రతి రోజూ పది వేల మంది కూలీలు పనులకు హాజరుకావాలనే లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. అలాగే దినసరి కూలి రూ.272కి తక్కువ కాకుండా కూలీలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జాబ్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. జాబ్ కార్డులేని వ్యక్తులు దరఖాస్తు చేసుకుంటే కొత్తవి మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ, ఈసీ సంజీవరావు పాల్గొన్నారు.


23న వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణకు ఇంటర్వ్యూలు

చింతపల్లి, ఫిబ్రవరి 21: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న గ్రామీణ పథకంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న యువతీ, యువకులు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ, ఉద్యోగాల కల్పనకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో వీర సాయి బాబు తెలిపారు. తొమ్మిది, పది, ఐటీఐ, డిగ్రీ, టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన 19-30 ఏళ్ల లోపు నిరుద్యోగులు ఇందుకు అర్హులన్నారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.272 చొప్పున నగదు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపడుతున్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాత పెన్షన్ విధానం అమలుచేయాలి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 21: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలుపై రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చే విధంగా కృషి చేయాలని కోరుతూ బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.తిరుపతిరావు, వైసీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం తదితరులకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు, మండల అధ్యక్షుడు ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.గోపి, సభ్యుడు గణేష్ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మృతి


పరమేశ్వరరావు (ఫైల్)

పెదబయలు, ఫిబ్రవరి 21: మండలానికి చెందిన రాజమంత్రి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు బుధవారం మృతి చెందారు. వనబంగి పంచాయతీ కేంద్రానికి చెందిన పరమేశ్వరరావు రాజమండ్రి ప్రభుత్వ వృత్తివిద్య కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 21: పీఎం కిసాన్‌కు రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో మధుసూదనరావు తెలిపారు. లింగవరం గ్రామంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి బుధవారం రైతుల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోకపోతే పీఎం కిసాన్ నిధులు రావడం లేదన్నారు. ఈ ఇప్పటికీ ఈ పథకం నిధులు అందని రైతులు సచివాలయంఉద్యోగుల వద్దకు వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు.

డీఈవో పాఠశాలల ఆకస్మిక తనిఖీ


విద్యా శాఖ కార్యాలయంలో రికార్డులు తనిఖీ డీఈవో

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 21: మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. డుంబ్రిగుడలోని మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే పదో తరగతి పరీక్షల సౌకర్యాలపై మండల విద్యాశాఖాధికారి సుందరరావును అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యం ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల ప్రగతికి తోడ్పాటునందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గిరి యువత క్రీడా నైపుణ్యం మెరుగుపరుచుకోవాలి



షీల్డుతో విజేత జట్టు క్రీడాకారులు.. పోలీసులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 21: గిరిజన యువత క్రీడా నైపుణ్యం మెరుగు పరుచుకోవాలని సీఐ రమేశ్, సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండర్ భగత్‌సింగ్ సూచించారు. సీఆర్పీఎఫ్ మెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరు టీములు పాల్గొనగా గూపిగెడ్డ జట్టు విజేతగా, కరకపల్లి జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు షీల్డుతో పాటు దుస్తులు, కిట్లను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లకు కిట్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, సీఆర్పీఎఫ్ ఇన్‌చార్జి సెన్సరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

సీలేరు, ఫిబ్రవరి 21: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు, ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో పోలింగ్ బూత్ కేంద్రాలను తహసీల్దార్ బి.రత్నకుమార్ బుధవారం పరిశీలించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతి సౌకర్యాలు ఉన్నాయా? లేదా? పరిశీలించారు. అలాగే బీఎల్‌వోలు, అధికారులకు సదుపాయాల కల్పనపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్, వీఆర్వో స్వరూప్, సర్పంచ్ పి.దుర్గో తదితరులు పాల్గొన్నారు.

చూడచక్కని సూరీడు



పచ్చని కొండలపై దట్టంగా పరుచుకున్న మంచు.. గిరుల మాటు నుంచి లేలేత కిరణాలు ప్రసరిస్తూ ఉదయిస్తున్న భానుడు.. ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకున్న ఈ దృశ్యం పాడేరులో బుధ వారం ఆవిష్కృతమైంది. ఈ మనోహర దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాతో బంధించింది.

- ఆంధ్రజ్యోతి/పాడేరు

95 డిటోనేటర్లు స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీ దళ సభ్యుడి లొంగుబాటు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ దళ సభ్యుడితో పాటు మిలిషియా సభ్యుడు లొంగిపోయారు. చింతూరు ఏఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం విలేకర్లకు వివరాలు అందించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, గచ్చనపల్లికి చెందిన పద్దం అడమయ్య 2014లో మావోయిస్టు విధానాలకు ఆకర్షితుడయ్యాడు. ప్రస్తుతం అడమయ్య గొల్లపల్లి ఎల్ఓఎస్ (లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్) సభ్యుడిగా క్రిష్టారం పరిధిలో పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన కణితి లచ్చ 2019 నుంచి 2021 వరకు మిలిషియా సభ్యుడిగా వ్యవహరించాడు. వివిధ కారణాలతో వీరిద్దరూ లొంగిపోవడంతో వారిని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

లోకేశ్‌ను కలిసిన సురేశ్‌కుమార్



పాడేరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేశ్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిపారు. టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి నేతృత్వంలో పార్టీ పటిష్టానికి చేపడుతున్న చర్యలు, టీడీపీ సూపర్-6 పథకాలను ప్రజల్లో తీసుకువెళుతున్న నైనాలను లోకేశ్‌కు వివరించారు. అలాగే టీడీపీ బలోపేతానికి తెలుగు యువత నేతలు చేపడుతున్న చర్యలను ఆయన తెలిపారు.

కొయ్యూరు బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

కొయ్యూరు, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల-1 హెచ్‌ఎం దేవమూర్తికి ఐటీడీఏ పీవో అభిషేక్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇందుకు సంబంధించి ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ అందచేసిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం పాడేరులో ఐటీడీఏ పీవో నిర్వహించిన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పీవో అడిగిన సమాచారం హెచ్‌ఎం చెప్పలేకపోగా, పక్కనే ఉన్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ద్వారా సమాచారం ఇప్పించేందుకు ప్రయత్నించారు. దీంతో పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు సంబంధించిన సమాచారం, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ తదితర విషయాలపై హెచ్‌ఎం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించిన పీవో వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై ఆయన సమాధానం అనుసరించి తదుపరి చర్యలు ఉంటాయని మెచ్‌డబ్ల్యూవో తెలిపారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీడబ్ల్యూ టీఏ నాయకులు

పాడేరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ విజయసునీతను గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అలాగే గిరిజన విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, గౌరవ అధ్యక్షుడు కుర్సాడి రామారావు, నేతలు ఎల్.లింగమూర్తి, భవానీ, సింహాచలం, సుభద్ర, సత్యనారాయణ, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరి రైతులకు సంత షెడ్ల పంపిణీ

చింతపల్లి, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలో నాబార్డు నిధులతో నిర్మించిన సంత షెడ్లను రైతుల (కూరగాయల వర్తకులు)కు పంపిణీ చేసినట్టు మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. బుధవారం షెడ్లలో సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.15 లక్షల నాబార్డు, రూ.5 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన 40 సంత షెడ్లు అందుబాటులోకి రావడంతో ఆనందకరమన్నారు. వీటిని గిరిజన వర్తకులకు లాటరీ పద్ధతిలో పంపిణీ చేశామన్నారు. వీటి వల్ల రహదారిలో ట్రాఫిక్ సమస్య తగ్గిందని, వర్తకులు విక్రయాలు నిర్వహించుకునేందుకు అనువైన షెడ్లు అందుబాటులోకి వచ్చాయని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గిరిజన వర్తకులు సంత షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా చిన్నారావు

జి.మాడుగుల, ఫిబ్రవరి 21: జి.మాడుగుల పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా సొలభం ఎంపీటీసీ సభ్యుడు కూడ చిన్నారావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. తన ఎంపికకు సహకరించిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అంకితభావంతో పనిచేసి రైతులకు సరైన సమయంలో రుణాలు అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా చిన్నారావు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్ మాట్లాడుతూ మాతృ భాష ఆవశ్యకత, కాపాడుకోవాల్సిన బాధ్యతలను వివరించారు. నేటి తరం యువతకు తెలుగు భాష సంరక్షణతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఈ సందర్భంగా కోదు, గదబ మాతృ భాష కలిగిన విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడించి మాతృ భాష ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు అశ్వినిరెడ్డి, కోటేశ్వరరావు, సౌజన్య, సునీతదేవి, రాధాకుమారి, శ్రీనివాసమూర్తి, మణికుమార్, అచ్యుతరావు, శంకరరావు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చీపురు రమాదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. కళాశాలం విద్యార్థులకు మాతృ భాషపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

ఉపాధ్యాయ పోస్టులు శతశాతం ఆదివాసీలకు కేటాయించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పడాల్

చింతపల్లి, ఫిబ్రవరి 21: షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు శతశాతం ఆదివాసీలకే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. బుధవారం గిరిజన ప్రాంత ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ సీఎం జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాసిన లేఖను ప్రదర్శించారు. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 6,100 పోస్టుల్లో ఎస్టీలకు 1,025 కేటాయించారన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 175 ఖాళీలకుగానూ ఎస్టీలకు ఏడు, రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలో 205 పోస్టులకు పది, సీతంపేటలో 35 పోస్టులకు ఆరు, కేఆర్ పురం పరిధిలో 70 పోస్టులకు ఎనిమిది మాత్రమే ఎస్టీలకు కేటాయించారన్నారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంతానికి కేటాయించిన పోస్టులన్నీ ఆదివాసీలతోనే భర్తీ చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.ధనుంజయ్, నాయకులు ఎస్.చిరంజీవి, ఎం.రాంబాబు, కె.సింహాచలం పాల్గొన్నారు.